క్లుప్తంగా

వినుకొండ ఎమ్మెల్యేను కలిసిన చిన హనిమిరెడ్డి



ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుతో సమన్వయకర్త చినహనిమిరెడ్డి

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి శుక్రవారం వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును వినుకొండలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న సమన్వయకర్త వెంకటేష్

చీరాల: చీరాల పట్టణానికి చెందిన కర్రెద్దుల శివకుమారికి రూ.65 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ అందించారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ జి.జగదీష్, ఎం.గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

చీరాల టౌన్/చీరాల: రూరల్ మండలం ఈపూరుపాలెంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 9గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌లు పాల్గొననున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

అద్దంకి: పట్టపగలే దొంగలు ఇంట్లో చొరబడి నగదు బంగారం దోచుకెళ్లిన ఘటన మండలంలోని గోపాలపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గోపాలపురం గ్రామానికి చెందిన యర్రం మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు మేత కోసుకుని వచ్చేందుకు పొలం వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సమయానికి ఇంట్లో దాచి ఉంచిన రూ.50 వేల నగదు, లక్షల విలువైన బంగారు నగలు దొంగలు అపహరించుకుకువెళ్లినట్లు గమనించారు. విషయాన్ని అద్దంకి సీఐ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు అవగాహన

చినగంజాం: నిరుద్యోగ యువతీ, యువకులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేడికొండ ఆశీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 10వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన నిరుద్యోగ యువతీ, యువకులు, టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ పాస్, ఫెయిల్ అయిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

బీఎస్పీ కార్యాలయం ప్రారంభం

చీరాల రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగాగల వసుంధర కాంప్లెక్స్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పరంజ్యోతి పాల్గొని మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే, డాక్టర్ అంబేడ్కర్ సిద్ధాంతాలతో నడుస్తున్న ఏకైక పార్టీ ఒక్క బీఎస్పీ పార్టీయేనని ఆయన పేర్కొన్నారు. బహుజన కులాలకు న్యాయం జరగాలంటే బీఎస్పీ రావాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కాకి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, దుడ్డు భాస్కరరావు, కె. మార్క్, షేక్ బాజీ షరీఫ్ పాల్గొన్నారు.

కన్నడ పదకవితా పితామహుడు పురంధరదాసు

అద్దంకి: కన్నడ పదకవితా పితామహుడు పురంధరదాసు అని తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. పురంధర దాసు ఆరాధన సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాల వేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పురంధరదాసు విగ్రహం అద్దంకిలో ఏర్పాటు చేసుకోవడం సాహితీ పెద్దల పూర్వ జన్మ పుణ్యఫలమని చెప్పారు. పురంధరదాసు కీర్తనలు పండితుని నుంచి పామరుని వరకు అందరికీ అర్థమయ్యే రీతిలో రచించరని గుర్తు చేశారు. దేవపాలన, రఘురామశర్మ, వెంకట్రావు పాల్గొన్నారు.

చిన్నపరిశ్రమల ఏర్పాటుకు జగనన్న ప్రోత్సాహం

- గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకుల ఆత్మీయ సమావేశంలో చిన హనిమిరెడ్డి



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం, సహకారాలు అందిస్తున్నారని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వేమవరం గాయత్రి గ్రానైట్స్‌లో మండల గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల గ్రానైట్ పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ చిటిపోతు మస్తానయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో పారిశ్రామిక వేత్తలుగా ఎదగటంతోపాటు ఒక్కో పరిశ్రమలో 20 నుంచి 30 మందికి ఉపాధి ఇవ్వటంపై నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఒడిశా, రాజస్థాన్ ప్రాంతాలనుంచి వేలాది మంది ఈ ప్రాంతంలోని పరిశ్రమలు క్వారీలో ఉపాధి పొందటం వల్ల నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. బల్లికురవ, సంతమాగులూరు, చీమకుర్తిలో స్టీల్ గ్రే, బ్లాక్ కలర్, గెలాక్సీ గ్రానైట్ రాళ్లకు ఇక్కడ పరిశ్రమల్లో తయారు చేసే శ్లాబులకు ప్రపంచ దేశాల్లోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తాను ఈప్రాంతానికి కొత్త అయిన నన్ను జగనన్న ఇక్కడకు పంపారని, కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని తాను ఇక్కడే అందుబాటులో ఉంటు సేవలతోపాటు గ్రానైట్ వ్యాపారుల సమస్యలను జగనన్న దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. త్వలో జరిగే ఎన్నికల్లో సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు హనిమిరెడ్డి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మల్లాయపాలెం సర్పంచ్ జూపల్లి రాఘవరావు, వేమవరం, చెన్నుపల్లి నాయకులు గోరంట్ల వెంకటేశ్వర్లు, ఏల్చూరి రవీంద్రబాబు, శింగరకొండ దేవస్థాన ట్రస్ట్ మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కరణం



బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

వేటపాలెం: నియోజకవర్గ పరిధిలో జరగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ దంతంపేటలో రూ. 8 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపలే పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, జేసీఎస్ మండల ఇంచార్జి లేళ్ల శ్రీధర్, మాజీ ఎంపీపీ చల్లా జనార్దన్, దంతం హనుమంతరావు, కర్ణ లక్షారావు, బీరక పరమేష్, గుత్తి నరసింహరావు, దంతం ఆనందబాబు, బండికళ్ల నరేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

చీరాల: పట్టణంలోని ముక్కోణం పార్కు సెంటర్‌లో ప్రారంభించనున్న రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులను ఎమ్మెల్యే కరణం పరిశీలించారు. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రెయిలింగ్, గార్డెన్‌లను ఆయన పరిశీలించారు. త్వరలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేపడతామని, పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ-2 అధ్యక్షులు గుంటూరు మాధవరావు, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కంపా అరుణ్, కె.యానాదిరావు, ఎస్.సత్యానందం, గుంటూరు ప్రభాకరరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, మున్సిపల్ డీఈ ఐసయ్య, ఏఈలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అధికారులు సహకరించాలి



కల్లంవారిపాలెం సచివాలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు



చినగంజాంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

బల్లికురవ/జే.పంగులూరు: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చీరాల డీఎల్‌పీవో హనుమంతరావు కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాలెం గ్రామాన్ని ఆయన పరిశీలించారు. సైడు కాలువలో మురుగు నీరు నిల్వలేకుండా చర్యలుతోపాటు వ్యర్థాలు, తడి, పొడి చెత్తలను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం సచివాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. తనిఖీలో ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోఆర్డీ సుమతి, సెక్రటరీ కోటేశ్వరరావు, వీఆర్వో వాసు తదితరులు పాల్గొన్నారు.

➤ పంగులూరు మండలంలోని చందలూరు, కల్లంవారిపాలెం, పంగులూరు గ్రామాల్లో జిల్లా అధికారులు గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. చందలూరు గ్రామాన్ని మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, కల్లంవారిపాలెం గ్రామాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, పంగులూరు గ్రామాన్ని హౌసింగ్ డీఈ ఈ వెంకటసుబ్బారావు, ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

గ్రామదర్శినిలో మౌలిక వసతుల పరిశీలన..

ఇంకొల్లు (చినగంజాం)/కారంచేడు: ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఇంకొల్లు, ఇడుపులపాడు గ్రామాలలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఇంకొల్లు గ్రామాన్ని ప్రత్యేకాధికారి, పీఆర్ ఎస్ఈ హరేరామకృష్ణ, ఇడుపులపాడు గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్ సందర్శించి వివిధ శాఖల పనితీరును పరిశీలించారు.

➤ చినగంజాం మండలంలోని గ్రామాలను పలు శాఖలకు సంబంధించిన అంశాలను ప్రత్యేకాధికారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా చినగంజాం గ్రామంలోని ఆసుపత్రులు, పాఠశాలలు, సచివాలయాలను ఆయన సందర్శించి పరిశీలించి మౌలిక వసతులను, స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యూబీ వరప్రసాదరావు, ఎంఈఓ బీ అజయ్ బాబు, ఈఓపీఆర్డీ ఎస్ వేణుగోపాలకృష్ణమూర్తి, కస్తూర్బా ప్రత్యేకాధికారి సుమాంజలి, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

➤ క్షేత్రస్థాయిలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రేపల్లె డివిజన్ ఇరిగేషన్ ఈఈ పీ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం ఆయన కారంచేడు మండలంలోని కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం గ్రామాల్లో నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జయప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ఎపుడొచ్చినా సీఎం జగనన్నే



హనిమిరెడ్డికి దిష్టితీసి ఆహ్వానిస్తున్న మహిళలు

అద్దంకి రూరల్: ప్రజారంజక పాలన అందిస్తున్న జగనన్నే మళ్లీ సీఎం అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కలవకూరు, గుర్రంవారిపాలెం గ్రామాలో పల్లెపల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో హనిమిరెడ్డికి మహిళలు దిష్టి తీసి హారతులు ఇచ్చారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రాబోయో ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కట్టకట్టుకుని వచ్చినా జగనన్న ఒక్కడిగానే విజయం సాధిస్తాడన్నారు. ప్రజా బలం ఉన్న నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, అవిశెన ప్రభాకరరెడ్డి స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

చీరాల అర్బన్: రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చని ఆర్టీసీ చీరాల డిపో మేనేజర్ జె.శ్యామల అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్‌కే ఓరియంటల్ స్కూల్‌లో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా నడపడం వలన ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలన్నారు. అలానే రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగవని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్



స్వర్ణ హైస్కూల్‌లో నులిపురుగుల మాత్రలను మింగిస్తున్న మెడికల్ ఆఫీసర్



తూర్పుకొప్పెరపాడులో విద్యార్థులచే మాత్రలు మిగిస్తున్న వైద్య సిబ్బంది



చినగంజాంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి కీర్తి సరోజ్



చీరాలలో విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఉపాధ్యాయులు

జే.పంగులూరు: ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్ పెట్టొచ్చని వైద్యాధికారులు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అన్ని పాఠశాలలో శుక్రవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. సంవత్సరం నుంచి 19 ఏళ్ల బాలబాలికల అందరికి ఆల్బెండజోల్ 400 గ్రాముల మాత్రలను విద్యార్థులచే మింగించారు. 6753 మంది విద్యార్థులు నులిపురుగుల మాత్రలను మింగించినట్లు తెలిపారు.

చినగంజాం/యద్దనపూడి/మార్టూరు/కారంచేడు: కడుపులో నులిపురుగుల నివారణతో అన్ని రకాల వ్యాధులను దూరం చేయ్యొచ్చని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ, డాక్టర్ హస్మప్రియలు అన్నారు. శుక్రవారం (డీ-వార్మింగ్ డే) జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని స్వర్ణ, కారంచేడు, దగ్గుబాడు పీహెచ్‌సీల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రలను మింగించే కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు. స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో సుమారు 1150 మందికి, కారంచేడు పీహెచ్‌సీ పరిధిలో 3903 మందికి లక్ష్యంగా సిబ్బంది పనిచేశారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


➤ చినగంజాం పీహెచ్‌సీ పరిధిలో 28 పాఠశాలలు, ఒక కాలేజీ, 35 అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 4890 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ తెలిపారు. చేతుల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి సరోజ్, సూపర్‌వైజర్‌లు వెంకటరమణ, మాధవి, వరదానం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

➤ ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 8402 మంది పిల్లలకు గాను 7997 మంది పిల్లలకు సుమారు 95.1 శాతం మంది మాత్రలు పంపిణీ చేశామని వైద్యాధికారి టీ అంజలి పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భానుప్రకాష్‌రావు, కోటేశ్వరరావు, పీహెచ్ఎన్ సహస్ర, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం..

చీరాల అర్బన్: చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చని పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం బి.సాల్మన్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా హైస్కూల్‌లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 మాత్రలు మింగించారు. కార్యక్రమంలో సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, సిబ్బంది గుంటూరు త్రివిక్రమ్, సందీప్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం



చినగంజాంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యద్దనపూడి: ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించటమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జెడ్పీటీసీ లక్ష్మినారాయణమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గన్నవరం గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ పల్లెపోగు అన్నమ్మ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో వైద్యసిబ్బంది 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ బాబు, జేసీఎస్ మండల కన్వీనర్ ధూళిపాళ్ల వేణు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వైద్యాధికారులు శ్రీహర్ష, భవానిదేవి, సాయిప్రసాద్ రావు, ఎస్‌కే, కరీమ్‌బాషా, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చినగంజాం: ప్రతి ఇంటికి సంపూర్ణ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం అని ఎంపీడీఎం యూబీ వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చినగంజాం పంచాయతీ పరిధిలోని సచివాలయం 2లో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 314 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్ సుధాకర్, ఎస్ విజయ భాస్కర్, సాయిశ్రీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు మండలంలోని నూతలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వైద్యాధికారి కృష్ణజ్యోతి, శ్వాసకోశ సంబంధ వ్యాధులకు సంబంధించి డాక్టర్ డీ శ్రీనాథ్, కంటి వైద్యులు నాగరాజు, జనరల్ వైద్యం డాక్టర్ ఈ సింధులు వైద్యపరీక్షలు నిర్వహించారు.